క్లుప్తంగా

అజేయ కల్లం ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న అజేయ కల్లం

త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. పూజల్లో మాజీ ఐఏఎస్ అధికారి, ప్రభుత్వ సలహాదారుడు అజేయ కల్లం పాల్గొన్నారు. త్రిపురాంతకంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో వేదపండితులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అజేయ కల్లానికి ఆలయాల ఈఓ చెన్నకేశవ రెడ్డి, చైర్మన్ సుబ్బారావులు స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాలను ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి జరిపించారు.

ఘనంగా మార్కండేశ్వర విళక్కి మహోత్సవం


ప్రత్యేక అలంకారంలో జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి

మార్కాపురంటౌన్: మార్కాపురం పట్టణంలో జగదాంబసమేత మార్కండేశ్వరస్వామి వారి విళక్కి మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు వరుణ్‌తేజ మార్కండేశ్వరునికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం శివస్వాములకు, భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామికి ప్రత్యేకంగా అలంకరించి నాలుగు మాఢ వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, చైర్మన్ కేశవశర్మ, ధర్మకర్తలుచ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


అంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని గోగినేనివారిపాలెంలో సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామచంద్రస్వామి, నాభిశిల, జీవధ్వజ, విమాన శిఖర, పోలేరమ్మ గమిడి శిల, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆగమ పండితులు పరాంకుశం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు పూజా క్రతువులు పూర్తి చేశారు. గోగినేనివారిపాలెం తోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి శాంతి కళ్యాణం


కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం శాంతి కళ్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి మూల విరాట్‌కు, రాజ్యలక్ష్మీ అమ్మవారికి అర్చకుల బృందం ప్రత్యేక పూజలు చేసింది. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రాల మధ్య కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులు అన్నసంతర్పణ చేశారు. ఆలయ ఈవో జీ.శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితం

పుల్లలచెరువు: ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి ఉచిత విద్య అందించేందుకు 25 శాతం సీట్లు విద్యాహక్కు చట్టం ప్రకారం ఉచితంగా ఇవ్వనున్నట్లు ఎంఈవో శామ్యూల్ జాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో స్టేట్ సిలబస్ అమలవుతున్న పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఒకటో తరగతి విద్యార్థులకు కేటాయించాల్సి ఉందన్నారు. అనాథ, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4శాతం, బీసీ వర్గాలకు చెందిన మైనార్టీలకు, ఓసీ గ్రామీణ ప్రాంత కుటుంబాలకు ఏడాదికి రూ.1.20 లక్షల ఆదాయం లోబడి ఉన్న వారికి 6 శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఐదేళ్ల నిండి అర్హులైన వారు ప్రస్తుత చిరునామా, ఆధార్, ఓటర్, రేషన్ కార్డు, జనన ధ్రువపత్రం, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మార్చి 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రమణీయం.. వేణుగోపాలుని కల్యాణం


వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జెడ్పీటీసీ ఇందిర హనుమారెడ్డి


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

తర్లుపాడు: తర్లుపాడులోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణం శనివారం వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని ఉభయ దేవేరులతో కలిసి ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ప్రతిష్ఠించారు. అర్చకులు వేదమంత్రాల సాక్షిగా కల్యాణ క్రతువును నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్త విజయభాస్కర్‌రావు, కమిటీ ప్రతినిధులు తీర్థప్రసాదాలు అందించారు. జెడ్పీటీసీ వెన్నా ఇందిర స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం హంస వాహనంపై ఉభయ దేవేరులతో కలిసి స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

దివ్యాంగులకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు


దివ్యాంగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని, రానున్న ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని తన నివాసంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం ప్రతినిధులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించాలని కోరారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంఘ జిల్లా అధ్యక్షుడు డి గోపాల్‌రెడ్డిని ఫోన్‌లో పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే దివ్యాంగుల సంఘ ప్రతినిధులైన ఎల్.శేఖర్, ఎన్వీ రమణారెడ్డి, సయ్యద్ రహమాన్, సురేంద్ర, విడుదల అశోక్, టి.వెంకట రమణ, మహీన్ తదితరులను సన్మానించారు.

గృహ ప్రవేశానికి హాజరైన నేతలు


పూజా కార్యక్రమంలో జంకె, కేపీ, అన్నా, ఉడుముల

పొదిలి రూరల్: పొదిలి విశ్వనాథపురంలోని వైఎస్సార్ రెడ్డినగర్‌లో శనివారం కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి సోదరుడు గురువారెడ్డి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, గిద్దలూరు సమన్వయకర్త, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మార్కాపురం ఇన్‌చార్జి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు, ఉడుముల శ్రీనివాసులురెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మర్రిపూడి, కొనకనమిట్ల ఎంపిపిలు వాకా వెంకటరెడ్డి, ఎం.మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసులురెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసులు, కేవీ రమణారెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, మోరా శంకర్‌రెడ్డి అక్కిదాసరి ఏడుకొండలు, పలువురు సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగొండలో భక్తుల సందడి


శ్రీవారి దర్శనంలో భక్తులు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్య క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి మూలవిరాట్‌ను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వాగుమడుగు పంచాయతీ రేగడపల్లిలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

స్పందించే హృదయాలు ట్రస్టుకు అవార్డు


అవార్డు అందుకుంటున్న శ్రీనివాస ప్రసాద్

కంభం: పట్టణానికి చెందిన స్పందించే హృదయాలు ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్‌కు ప్రైడ్ ఇండియా అవార్డును బ్రౌన్ రిచ్ మీడియా శనివారం బెంగళూరులోని తాజ్ హోటల్లో అందజేశారు. జాతీయ స్థాయిలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో స్వచ్ఛంద సంస్థ విభాగంలో ఎంపిక చేశారు. ట్రస్ట్ ప్రారంభించిన 20 నెలల కాలంలోనే 50 సంక్షేమ కార్యాక్రమాలు నిర్వహించారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న దాతలు, మిత్రులకు శ్రీనివాస ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత కె.రాధాదేవి, ఐఆర్ఎస్ అధికారి మని వాచగం, ఎన్‌బీబీఎస్ చైర్మన్, ఏబీసీసీ డైరెక్టర్ సూరి మిరాడే పాల్గొన్నారు.

నీటి సమస్యలపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రాజయ్య

పెద్దారవీడు: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న నీటి సమస్యలపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బెజవాడ పెద్ద రాజయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, దానిపై చర్యలు తీసుకోకపోతే గ్రామాల్లో తిరగలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎంపీపీ రాజయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న నీటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే నీటి బిల్లులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ యేర్వ చలమారెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, సీఎం సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుగా వెళ్లాలని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్షల ప్యాడ్ల పంపిణీ


ప్యాడ్లు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని పలు కళాశాలల విద్యార్థులకు విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎగ్జామ్స్ ప్యాడ్స్ పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలోని విద్యార్థులకు విజయ్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ సంద్రపాటి విజయ్‌కుమార్ ఎగ్జామ్స్ ప్యాడ్స్ అందజేశారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ పల్లెబోయిన లాలయ్య, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ అనూష, చాట్ల గంగయ్య పాల్గొన్నారు.

రేపు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

కొనకనమిట్ల: ఈ నెల 26న సోమవారం స్థానిక కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం కర్నాటి గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు హాజరవుతారని పేర్కొన్నారు. మండలంలోని పొదుపు సంఘాల సభ్యులు, మండల స్థాయి అధికారులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఏపీఎం కోరారు.

జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం


రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీటీ

దొనకొండ: మండలంలోని సచివాలయాల పరిధిలో జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ అధికారులు వేగవంతంగా చేపడుతున్నారు. 704 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం జగనన్న ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. అధికారులు శనివారం నాటికి 558 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేశారు. మండల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. త్వరలో మిగిలిన వారికి రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

మార్చి 1న చెన్నకేశవస్వామి ఆలయంలో వేలం


మార్కాపురం టౌన్: శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం పరిధిలో తలనీలాలు పోగుచేసుకునే హక్కుకు మార్చి 1వ తేదీ ఉదయం 10 గంటలకు దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ జి.శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. ఈ ఏడాది మే 1 నుంచి 2025 ఏప్రిల్ 30వ తేదీ వరకు హక్కు ఉంటుందని, టెండర్ కమ్ బహిరంగ వేలంలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

ఉత్తమ వలంటీర్‌కు సన్మానం


కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న బ్రహ్మారెడ్డి


కొనకనమిట్ల: మండలంలోని నాగంపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని వింజవర్తిపాడుకు చెందిన కోటపాటి బ్రహ్మారెడ్డి ఉత్తమ వలంటీర్‌గా ఎంపికయ్యారు. శనివారం ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా వలంటీర్‌ను సర్పంచ్ తాతిరెడ్డి చినవెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కొండ్రు వెంకటేశ్వర్లు, సచివాలయ కార్యదర్శి కాశీంవలి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు దేవిరెడ్డి గోపాల్‌రెడ్డి, యక్కంటి అక్కిరెడ్డి, తోటి వలంటీర్లు అభినందించారు.

దశదిన కర్మకు హాజరైన తాటిపర్తి


పుష్పావతి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తాటిపర్తి చంద్రశేఖరరావు

జరుగుమల్లి: మండల కేంద్రమైన జరుగుమల్లిలో పులి పుష్పావతి, పులి సుందరరావు దశదిన కర్మ శనివారం నిర్వహించగా యర్రగొండపాలెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ హాజరయ్యారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దుంపా అనిల్‌కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ పులి భిక్షాలు, భాస్కర చౌదరి, శంకరరెడ్డి, పెద్దారవీడు మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి


త్రిపురాంతకంలో గ్రంథాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చైర్మన్

త్రిపురాంతకం: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాచగొర్ల సుశీల వెంకటపిచ్చయ్య, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి అన్నారు. త్రిపురాంతకంలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిల్లాలో మరెక్కడా లేని విధంగా మండల కేంద్రంలో ఈ గ్రంథాలయాన్ని నిర్మించామన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఆదిలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోటి వెచ్చి పుస్తకాలు అందించిందన్నారు. జిల్లాలో కొన్ని చోట్ల గ్రంథాలయ భవన నిర్మాణాలు చేపట్టాల్సి ఉందన్నారు. ఎంఈఓలు మల్లికార్జున నాయక్, రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్షలకు అవసరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, సచివాలయ కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ బి.కోటేశ్వరి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఉద్యోగ సంఘం అధ్యక్షుడు సుబ్బారెడ్డి, ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

వికలాంగులకు మోటార్ వాహనాల పంపిణీ


మూడు చక్రాల మోటారు సైకిళ్లు పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

దర్శి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు మూడు చక్రాల మోటారు సైకిళ్లను శనివారం దివ్యాంగులకు పంపిణీ చేశారు. జెడ్పీ నిధులతో సమకూర్చిన వాహనాలకు స్థానిక బూచేపల్లి నివాసంలో పూలమాలలు వేసి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ ఒక్కో మోటారు సైకిల్ విలువ రూ.1.25 లక్షలని చెప్పారు. ఆరు మోటారు సైకిళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వికలాంగులకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. అన్నీ రంగాల్లో వారికి సదావకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వికలాంగుల కోసం తమ ట్రస్ట్ నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. దివ్యాంగులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. జెడ్పీ సీఈఓ హనుమంతరావు, ఎంపీడీఓలు రాఘవేంద్రరావు, హనుమంతరావు, మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, దాసరి లక్ష్మీనారాయణ, చింతలపూడి శ్రీనివాసరెడ్డి, కేసరి రాంభూపాల్‌రెడ్డి, గంజి వెంకటేశ్వరరెడ్డి, చెరుకూరి జగన్, మేడం మోహన్‌రెడ్డి, సోము దుర్గారెడ్డి, కేవీ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ తిరుపతమ్మ కళ్యాణ మహోత్సవం


బూచేపల్లి కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న భక్తులు

దర్శి: పట్టణంలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి సమేత గోపయ్య స్వామి కళ్యాణ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని బంగారమ్మ బావి వద్ద ఆలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆర్యవైశ్య మహిళలు పసుపు, కుంకుమ, వస్త్రాలు అందజేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరిని భక్తులు ఘనంగా సత్కరించారు. శివప్రసాద్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చలివేంద్రలోని గోశాలలో గోవులకు ఆహారం అందజేశారు. వెంకటాచల క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీనాయన ఆశ్రమంలో అన్నదానం చేశారు.

చేతివృత్తుల మహిళలకు చేయూత


ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీడీఓ యుగకీర్తి

తాళ్లూరు (ముండ్లమూరు): మహిళలకు చేతి వృత్తులతో చేయూత నిచ్చే విధంగా జనశిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ కె.యుగకీర్తి తెలిపారు. మండలంలోని బొద్దికూరపాడులో జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రస్ మేకింగ్ శిక్షణ ముగింపు సందర్భంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచితంగా అనేక రకాల శిక్షణలు ఇస్తున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా నిరుద్యోగ యువతకు, మహిళలకు, గృహిణులకు డ్రస్ మేకింగ్, బ్యూటిషియన్, హ్యాండ్ ఉంబ్రాయిడరీ, మగ్గం వర్క్, ఫ్యాషన్ జ్యువెలరీ బేసిక్ కంప్యూటర్స్ శిక్షణలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆశక్తి ఉన్నవారు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జన శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్యాంసునీల్, డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్ నాగమణి, ఏపీఎం దేవరాజ్, మహిళలు పాల్గొన్నారు.

గ్రూప్-2 పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- 110 మంది పోలీసులు, ఇద్దరు సీఐలు, 9 మంది ఎస్సైలతో బందోబస్తు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- డీఎస్పీ బాలసుందరరావు వెల్లడి


మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుందరరావు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఆదివారం నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు డీఎస్పీ బాలసుందరరావు తెలిపారు. శనివారం సాయంత్రం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కాపురం పట్టణంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని, అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 144 సెక్షన్ విధించామని, పట్టణంలో ఎవరూ గుంపులు గుంపులుగా సంచరించవద్దన్నారు. ప్రశాంతంగా పరీక్షల నిర్వహణ కోసం 110 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో మార్కాపురం, కంభం సీఐలు ఆవుల వెంకటేశ్వర్లు, రామకోటయ్యతోపాటు 9 మంది ఎస్సైలు ఇంకా మొబైల్ పార్టీలు ఉన్నాయని వివరించారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, గడియార స్తంభం దగ్గర హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉండే జిరాక్స్ సెంటర్లు, నెట్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. హాల్‌టిక్కెట్, గుర్తింపు కార్డు, పెన్ను మాత్రమే పరీక్ష హాలులోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. జిల్లాలో వివిధప్రాంతాల నుంచి వందల సంఖ్యలో పరీక్ష రాసేందుకు అభ్యర్థులు వస్తున్న దృష్ట్యా ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు. సమీక్షలో పట్టణ, రూరల్ ఎస్సైలు అబ్దుల్ రెహమాన్, వెంకటేశ్వరనాయక్‌తోపాటు సర్కిల్‌లోని పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

పీఆర్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా కరీముల్లా


నూతనంగా ఎన్నికైన సంఘ నాయకులు

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశం హాలులో శనివారం సాయంత్రం ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల బేస్తవారిపేట సమితి యూనిట్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా సయ్యద్ కరీముల్లా(బేస్తవారిపేట), ఉపాధ్యక్షులుగా కె.భాస్కరరావు (బేస్తవారిపేట), ప్రధాన కార్యదర్శిగా కె.చంద్రశేఖరరెడ్డి (అర్ధవీడు), సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ కిశోర్ (బేస్తవారిపేట), కోశాధికారిగా కె.వెంకటేశ్వర్లు (పిటికాయగుళ్ల), జిల్లా కౌన్సిలర్-1 టి.శివశ్రీ (జంగంగుంట్ల), జిల్లా కౌన్సిలర్-2 మునివరకుమార్ (పూసలపాడు)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ నాయకులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

వైద్యశాలలో విచారణ చేపట్టిన అధికారులు

కంభం: స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం అందడం లేదని, అవకతవకలకు పాల్పడుతున్నారని షెడ్యూల్డు కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శనివారం విచారణ చేపట్టారు. మార్కపురం వైద్యశాల సూపరింటిండెంట్ సుబ్బారెడ్డి విచారణ అధికారిగా హాజరై వివరాలు సేకరించారు. వైద్యశాలలో రికార్డులు పరిశీలించి సిబ్బందిని విచారించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలెంరాజు హాజరై సూపరింటెండెంట్‌పై వచ్చిన ఆరోపణలను పూర్తిస్థాయిలో విచారించి తగిన ఆధారాలుంటేనే చర్యలు తీసుకోవాలని కోరారు.